ఎస్ఎస్ఏ బడ్జెట్‌కు రూ. 273 కోట్లు కోత

- రాష్ట్ర ప్రభుత్వ నిధులు ఖర్చుచేయకపోవడంతో కోత పెట్టిన కేంద్రం
- నిరుడు రూ. 1,913 కోట్లకు ఆమోదం.. ఈ సారి రూ. 1,640 కోట్లకే పరిమితి

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): ఆదాయం లేదు.. డబ్బుల్లేవు.. జీతాలివ్వలేమంటున్న కాంగ్రెస్ సర్కారు ఉన్న నిధులను ఖర్చు చేయలేక రాష్ట్రాన్ని తిరోగమన దిశలో నడుపుతున్నది. కేంద్రం ఇచ్చిన నిధులను సక్రమంగా వినియోగించలేకపోతున్నది. కేంద్రం వాటా నిధులకు తోడు, రాష్ట్రవాటా నిధులను సకాలంలో విడుదల చేయడంలేదు. ఫలితంగా 2025-26 విద్యాసంత్సరం బడ్జెట్ ఆమోదం కోసం ఇటీవలే ఢిల్లీలో నిర్వహించిన సమగ్రశిక్ష ప్రాజెక్ట్(ఎస్ఎస్ఏ) అప్రూవల్‌బోర్డు సమావేశం లో కేంద్రం రూ. 273 కోట్లకు కోతపెట్టింది. 2024-25 విద్యాసంవత్సరం రూ.1,913 కోట్ల బడ్జెట్‌కు కేంద్రం ఆమోదం తెలుపగా, 2025-26 విద్యా సంవత్సరానికి మాత్రం రూ. 1,640 కోట్ల సీలింగ్ విధించింది.

రాష్ట్రం నిధులివ్వకపోవడంతోనే..

ఎస్ఎస్ఏ ప్రాజెక్ట్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులను ఖర్చుచేస్తాయి. 2024-25లో ఆమోదించిన రూ.1,913 కోట్లల్లో.. రూ. 1,148.34 కోట్లు కేంద్రం వాటాగా, రూ.765 కోట్లు రాష్ట్ర వాటాగా ఖర్చుచేసేందుకు ఆమోదం తెలిపాయి. కేంద్రం మూడు ఇన్‌స్టాల్‌మెంట్ల నిధులను విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కేవలం రెండు ఇన్‌స్టాల్‌మెంట్ల నిధులను మాత్రమే విడుదల చేసింది. మూడో ఇన్‌స్టాల్‌మెంట్‌గా కేంద్రం రూ. 242కోట్లను విడుదల చేయగా, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా రూ.161కోట్లను ఆఖరు వరకు విడుదల చేయలేదు. పైగా నాలుగో ఇన్‌స్టాల్‌మెంట్ నిధులను విడుదల చేసినా వాడుకోలేని పరిస్థితి నెలకొన్నది. దీంతో బడ్జెట్‌కు కేంద్రం కోతపెట్టింది.

నేడు క్యాబినెట్ భేటీ

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): తెలంగాణ క్యాబినెట్ సమావేశం బుధవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరుగనున్నది. ఈ సమావేశంలో రాష్ట్ర బడ్జెట్‌కు క్యాబినెట్ ఆమోదం తెలుపనున్నది.

40% పడిపోయిన రాబడి!

- నిరుడు కంటే భారీగా తగ్గిన ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ల ఆదాయం
- రిజిస్ట్రేషన్ల శాఖ లక్ష్యం రూ.18,229 కోట్లు.. వచ్చింది రూ.10,313 కోట్లు
- మద్యం ఆదాయంలో రూ. 2500 కోట్లు తగ్గుదల
- రియల్‌ఎస్టేట్ డీలానే కారణం

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ అంచనాలకు గండి కొడుతూ ఇటు మద్యం ద్వారా వచ్చే రాబడి, అటు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం భారీగా పడిపోయింది. రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా రూ.22.5 వేల కోట్ల ఆదాయం పొందాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా ఆ దరిదాపుల్లో కూడా రాబడి రాలేదని అధికారులు చెప్తున్నారు. కరోనా కాలంలో తప్ప రాష్ట్ర చరిత్రలో ఈ స్థాయిలో క్షీణత నమోదు కావడం ఇదే తొలిసారని కమర్షియల్ ట్యాక్స్ అధికారులు చెప్తున్నారు. వాస్తవ రాబడిని లెక్కలోకి తీసుకోకుండా ప్రభుత్వం రూ.3.5 లక్షల కోట్లతో భారీ బడ్జెట్‌ను రూపొందిస్తున్నట్టు తెలిసింది.

లక్ష్యానికి సుదూరంలో రాబడి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో పక్షం రోజులు మాత్రమే ఉండగా రిజిస్ట్రేషన్ల శాఖ రూ.10,313 కోట్లు మాత్రమే ఆర్జించింది. గత ఏడాది ఇదే సమయానికి రూ.18,229 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది ఐదు శాతం అదనపు ఆదాయంతో రూ.22,750 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో రిజిస్ట్రేషన్ల ఆదాయం భారీగా తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో ఎల్ఆర్ఎస్ రాయితీలను ప్రకటించారు. అయినప్పటికీ నిర్దేశించుకున్న లక్ష్యంలో ఇప్పటికి సగం కూడా రాబడి రాలేదు. 2023-24తో పోల్చితే గత పది నెలల్లో రాష్ట్ర రాబడులు 30 శాతం పడిపోగా, ఆర్థిక పురోగతి ఉండాల్సిన ఈ రెండు నెలల్లో రాబడి తిరోగమనంలో సాగిందని ఆ శాఖ అధికారులు పేర్కొన్నారు. 2023-24లో ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి వరకు 14.52 లక్షల దస్తావేజులు రిజిస్టర్ కాగా 2024-25లో ఇదే కాలంలో 12.16 లక్షలు మాత్రమే అమ్ముడు పోయినట్టు ఆ శాఖ అధికారి ఒకరు 'నమస్తే తెలంగాణ' ప్రతినిధికి వివరించారు.

రియల్ పతనం వల్లనే

రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా పడిపోవటం వల్లనే రిజిస్ట్రేషన్ల రాబడిలో క్షీణత నమోదైందని అధికారులు చెప్తున్నారు. ఈ ఏడాది హైడ్రా, మూసీ వెంబడి కూల్చివేతలు, అవినీతి ఆరోపణలు వంటి కారణాలతో రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్ధత నెలకొన్నదని, ఆదాయం తగ్గుదలకు అదే కారణమని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు రిజిస్ట్రేషన్ల శాఖలో అసంబద్ధ బదిలీలు, కూడా ప్రభావం చూపినట్టు ఆ శాఖ అధికారులు చెప్తున్నారు.

తగ్గిన లిక్కర్ విక్రయాలు..

రాష్ట్ర బడ్జెట్‌లో 20% వరకు ఆదాయాన్ని మద్యం విక్రయాల ద్వారానే రాబట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ ఏడాది దాదాపు రూ.60 వేల కోట్లు టార్గెట్‌గా పెట్టుకున్నట్టు సమాచారం. ఇందుకోసం ధరల పెంపు, కొత్త కంపెనీలకు అనుమతి, ప్రపంచస్థాయి మద్యం బ్రాండ్లకు అనుమతి వంటి నిర్ణయాలు తీసుకున్నారు. బీర్ల ధరలు పెరిగితే అదే రీతిలో ప్రభుత్వ ఆదాయం కూడా పెరుగుతుంది. కానీ ఈ ఏడాది మద్యం విక్రయాలు పడిపోయాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఎక్సైజ్ శాఖకు రూ.35 వేల కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.55 వేల కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇటీవల బీర్ల ధరలు పెరిగిన నేపథ్యంలో రూ.5 వేల కోట్లు అదనంగా వస్తాయ ని అంచనా వేశారు. కానీ గత ఆర్థిక ఏడాది రాబడితో పోలిస్తే రూ. 2500 కోట్లు తక్కువగా వచ్చినట్టు ఎక్సైజ్ నివేదికలు చెప్తున్నాయి. ఎక్సైజ్ శాఖ లెక్కల ప్రకారం.. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో రూ.9,438 కోట్ల మద్యం విక్రయాలు జరుగగా, నిరుడు రూ.10,542 కోట్ల అమ్మకాలు జరిగాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోవడంతో దీని ప్రభావం ఇతర శాఖపై పడుతుందని ఎక్సైజ్ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

నేడు రాష్ట్ర బడ్జెట్

- రూ.3.10 లక్షల కోట్లుగా అంచనా
- 9 గంటలకు క్యాబినెట్ సమావేశం
- అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న భట్టి, మండలిలో శ్రీధర్‌బాబు
- వ్యవసాయరంగానికి భారీగా కేటాయింపులు తగ్గే అవకాశం

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రవేశపెట్టనున్నది. ఉదయం 9 గంటలకు రాష్ట్ర మంత్రివర్గం అసెంబ్లీలో సమావేశం కానున్నది. ఈ సందర్భంగా ఆర్థికశాఖ రూపొందించిన బడ్జెట్‌కు ఆమోదం తెలుపనున్నది. అనంతరం 11:14 గంటలకు డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టనుండగా, శాసన మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టనున్నారు. సుమారు రూ.3.10 లక్షల కోట్లతో బడ్జెట్‌ను రూపొందించినట్టు ఇప్పటికే ఆర్థిక శాఖ వర్గాలు లీకులిచ్చాయి. గతేడాది బడ్జెట్ కన్నా దాదాపు 7% అదనంగా బడ్జెట్ ఉంటుందని పేర్కొన్నాయి.

అప్పులపైనే భారం..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1.64 లక్షల కోట్ల పన్ను ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే, జనవరి నాటికి కేవలం రూ.1.12 లక్షల కోట్లు మాత్రమే వచ్చిందని కాగ్‌కు ఇచ్చిన నివేదిక వెల్లడించింది. మార్చి చివరి నాటికి రూ.1.25 లక్షల కోట్ల వరకు రావొచ్చని అంచనా వేస్తున్నది. అయితే.. కీలక రంగాల్లో స్తబ్ధత కొనసాగుతుండటంతో ఈ ఏడాది కూడా పన్ను ఆదాయం అంచనాలను చేరుకోవడం కష్టమేనని చెప్తున్నారు. ముఖ్యంగా జీఎస్టీ వసూళ్ల వృద్ధిలో స్తబ్ధత, స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ అంచనాల్లో సగం కూడా రాకపోవడం, ధరల పెంపుతో ఎక్సైజ్ అమ్మకాలు తగ్గిపోవడం వంటి కారణాలతో రాబడులు తగ్గుతాయని పేర్కొంటున్నారు. మొత్తంగా ప్రభుత్వం అంచనాల్లో దాదాపు రూ.40-45 వేల కోట్ల వరకు లోటు ఉంటుందని చెప్తున్నారు. ఈ నేపథ్యంలో అప్పులు, భూముల అమ్మకాలపైనే ఆధారపడక తప్పదని స్పష్టం చేస్తున్నారు. బడ్జెట్ రుణాలు గతేడాది రూ.60 వేల కోట్ల వరకు ప్రతిపాదించగా, ఈసారి రూ.80 వేల కోట్ల వరకు తీసుకోవచ్చని చెప్తున్నారు.

వ్యవసాయానికి కోతలేనా?

తాజా బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి భారీగా కోతలు విధించే అవకాశం ఉన్నదని తెలుస్తున్నది. 2024-25లో వ్యవసాయ రంగానికి రూ.49,383 కోట్లు కేటాయించారు. ఇందులో రుణమాఫీకే రూ.26 వేల కోట్లు వెచ్చించారు. ప్రభుత్వం రుణమాఫీ పూర్తయిందని చెప్పుకుంటున్న నేపథ్యంలో ఈ మేరకు నిధులు తగ్గించే అవకాశం ఉన్నదని సమాచారం. దాదాపు రూ.25-30 వేల కోట్లు వ్యవసాయానికి కేటాయించే అవకాశం ఉన్నదని తెలుస్తున్నది. స్థానిక సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల నేపథ్యంలో నిధులు కేటాయించే అవకాశం ఉన్నదని సమాచారం.

తూతూమంత్రపు కేటాయింపులేనా?

గత బడ్జెట్‌లో అనేక పథకాలు, కార్యక్రమాలకు ప్రభుత్వం నిధులు కేటాయించినా, వాటిని వినియోగించలేదు. ఇదే తరహాలో ఈసారీ తూతూమంత్రపు కేటాయింపులే ఉండొచ్చంటున్నారు. 2024-25లో పంట లబీమాకు రూ.1300 కోట్లు కేటాయించినా అమలు చేయలేదు. రెండు దఫాల్లో రైతు భరోసా పథకానికి రూ.15వేల కోట్లు కేటాయించినా.. ఒక్కసారి మాత్రమే విడుదల చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి రూ. 7,740 కోట్లు కేటాయించగా ఒక్క రూపాయి వినియోగించలేదు. సీఎం దళిత సాధికారత పథకానికి రూ.2 వేల కోట్లు కేటాయింపులకే పరిమితమయ్యాయి.

పార్టీ ఫిరాయించలేదు.. కాంగ్రెస్‌లో చేరలేదు!

- ఇప్పటికీ బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నా
- సుప్రీంకోర్టుకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అఫిడవిట్

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): పార్టీ మారలేదని, కాంగ్రెస్ పార్టీలో చేరలేదని, ఇప్పటికీ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలోనే కొనసాగుతున్నానని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై ఈనెల 25న విచారణ జరపనున్న సుప్రీంకోర్టు.. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. దీంతో ఆ నోటీసులకు ఎమ్మెల్యేలు స్పందిస్తున్నారు. అందులో భాగంగా మహిపాల్‌రెడ్డి సుప్రీంకోర్టుకు సుదీర్ఘ వివరణ ఇచ్చారు. తాను పార్టీ మారినట్టు, కాంగ్రెస్‌లో చేరినట్టు వచ్చిన ఆరోపణలను ఆయన కొట్టివేశారు. బీఆర్ఎస్ పార్టీతో తనకు సుదీర్ఘ అనుబంధం ఉందని, రాష్ట్ర శాసనసభకు 2018, 2023లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫునే పోటీచేసి గెలిచానని తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక వ్యక్తిగత స్థాయిలో ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశానని, దాన్ని మీడియా వక్రీకరించిందని, తాను కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు వార్తలన్నీ అవాస్తవాలని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టుకు మహిపాల్‌రెడ్డి పంపిన అఫిడవిట్ కాపీ ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

26న చలో రామోజీ ఫిలింసిటీ

- నిర్బంధాలను ఎదిరించి ఇండ్ల స్థలాలు సాధిస్తాం
- రాయపోల్‌లో ఫిలింసిటీ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

ఇబ్రహీంపట్నం, మార్చి 18: ఈ నెల 26న చలో రామోజీ ఫిలింసిటీ కార్యక్రమం చేపట్టి, గతంలో ప్రభుత్వం పేదలకు కేటాయించిన స్థలాల్లోకి వెళ్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య తెలిపారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో రామోజీ ఫిలింసిటీ భూబాధితులతో సీపీఎం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ, ముదిగొండ అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో 2007లో అప్పటి ప్రభుత్వం నాగన్‌పల్లి, పోల్కంపల్లి, రాయపోల్, ముకునూరు గ్రామాల పేదలకు ఇండ్ల స్థలాల సర్టిఫికెట్లు జారీచేసిందని తెలిపారు. కానీ, ఆ భూముల్లోకి వెళ్లకుండా రామోజీ ఫిలింసిటీ యాజమాన్యం అడ్డుకుంటున్నదని ఆరోపించారు. పేదలు ఇండ్లు నిర్మించుకుంటామంటే అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నదని పేర్కొన్నారు. అటు ప్రభుత్వం, ఇటు అధికారులు, ఎమ్మెల్యే రామోజీ ఫిలింసిటీ యాజమాన్యానికి వత్తాసు పలుకుతూ.. పేదలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఎన్ని శక్తులు అడ్డుకున్నా, ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు విధించినా, కేసులు నమోదుచేసినా వెనకడుగు వేసే ప్రసక్తే లేదని తెలిపారు.

రామోజీ ఫిలింసిటీ స్థలాల పోరాట కమిటీ ఎన్నిక

15 మంది సభ్యులతో రామోజీ ఫిలింసిటీ పోరాట కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా పంది జగన్, కో కన్వీనర్‌గా బుగ్గ రాములు, కమిటీ సభ్యులుగా యాదయ్య, రాములు, రాజు, రాణి, సుమలత, బాలరాజు, ఎల్లమ్మ, కృష్ణ, సంతోష, యాదయ్య, రాములు, బాలమ్మ, బాలరాజు, జంగయ్య, జ్యోతి, మణెమ్మ, భారతమ్మ, సుజాత, సునీ, పాండును ఎన్నుకున్నారు.

కొత్త పింఛన్లు ఇప్పట్లో లేవ్!

- పెంపునకు ఇంకా మూడేండ్ల సమయం ఉన్నది
- కొత్త పింఛన్ దరఖాస్తుల వెబ్‌సైట్ పనిచేస్తలేదు
- గత సర్కార్ ఇచ్చిన పింఛన్లనే కొనసాగిస్తున్నం
- శాసనమండలిలో స్పష్టం చేసిన మంత్రి సీతక్క

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త పింఛన్లను అమలు చేయడం లేదని శాసనమండలిలో మంత్రి సీతక్క మంగళవారం స్పష్టంచేశారు. గత సర్కారు హయాంలో అమలు చేసిన పింఛన్ విధానాన్నే తమ ప్రభుత్వంలోనూ అమలు చేస్తున్నామని తెలిపారు. తమ మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా పింఛన్లను పెంచేందుకు ఇంకా మూడేండ్ల వరకు సమయం ఉన్నదన్నారు. అంటే అప్పటి వరకు పాత పింఛన్లే అమలవుతాయని ఆమె చెప్పకనే చెప్పారు. శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ కవిత లేవనెత్తిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చే క్రమంలో మంత్రి సీతక్క ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛన్ల కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునే కార్యక్రమం ఇంకా ప్రారంభం కాలేదని, వెబ్‌సైట్ సరిగా పని చేయడం లేదని చెప్పారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల మేరకు కలెక్టర్ల విచక్షణ ప్రకారం మానవీయ కోణంలో వృద్ధులు, దివ్యాంగులకు కలిపి కొత్తగా 45 వేల మందిని పింఛన్ల జాబితాలో చేర్చినట్టు తెలిపారు. దివ్యాంగులకు రూ.6 వేలు ఎప్పటి నుంచి ఇస్తారు? అన్న ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వకుండా మంత్రి దాటవేసే ప్రయత్నం చేశారు.

మిషన్ భగీరథ కొనసాగుతున్నది

బీఆర్ఎస్ హయాంలో ప్రవేశ పెట్టిన మిషన్ భగీరథ పథకం పేరిటే ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు మంచి నీటిని సరఫరా చేస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. ప్రస్తుతం గ్రామీణ, గిరిజన ప్రాంతాలతో పాటు తండాల్లోనూ తీవ్ర మంచినీటి ఎద్దడి ఏర్పడిందని, ఆయా ప్రాంతాలో ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమేనని అంగీకరించారు. అయితే మంచినీటి కనెక్షన్లు సరిగా లేక పోవడం వంటి ఇతర కారణాలతో మంచినీటి లభ్యత కొరవడిందని తెలిపారు.

100 కోట్ల ఆదాయం వస్తే ట్రస్ట్‌బోర్డు

- యాద్రాద్రి ఆదాయం ఏటా రూ. 224 కోట్లు
- టీటీడీ తరహాలో వైటీడీ బోర్డు
- 18 మంది సభ్యులు.. జీతభత్యాలు ఉండవు
- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రూ.100 కోట్లు ఆర్జించే అన్ని ఆలయాలకు ట్రస్ట్‌బోర్డును ఏర్పాటు చేస్తామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. టీటీడీ తరహాలో వైటీడీ బోర్డు, ఇతర దేవాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించి 'తెలంగాణ ధార్మిక, హిందూ మత సంస్థల, ధర్మాదాయముల సవరణ బిల్లు-2025'ను ఆమె అసెంబ్లీలో ప్రవేశపెట్టి మాట్లాడారు. ఈ సవరణ బిల్లు ద్వారా వైటీడీ బోర్డులో 18 మంది సభ్యులు, ఈవోగా ఐఏఎస్ అధికారి ఉంటారని తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ ఆదాయం ఏటా రూ.224 కోట్లు వస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో టీటీడీ తరహాలోనే వైటీడీని కూడా ఇతర రాష్ట్రాల్లో విస్తరించేలా ప్రణాళికలు రచిస్తున్నట్లు వెల్లడించారు. వైటీడీలో ఉండే 18 మంది సభ్యులకు ఎలాంటి జీతభత్యాలు ఉండవని, బదులుగా టీఏ, డీఏ బోర్డు కల్పిస్తుందని చెప్పారు. వైటీడీ పరిధిలో భిక్షాటన, పశువధ, మాంసాహారం, మద్యపానం నిషేధిస్తున్నట్లు తెలిపారు. వైటీడీ బోర్డు విద్యా సంస్థలను నిర్వహించుకునే వెసులుబాటు కల్పించామని వెల్లడించారు. గోశాలలకు, విద్యా సంస్థలకు ఏటా బోర్డు నుంచి నిధులు వెచ్చించేలా ప్రణాళికలు రూపొందించామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 12,434 దేవాలయాలను సవరణ బిల్లులో నాలుగు క్యాటగిరీలుగా విభజించారు. ఏటా రూ.2లక్షల నుంచి రూ. 100 కోట్లకు పైగా ఆదాయం వచ్చే దేవాలయాలు ఈ క్యాటగిరిల్లో ఉన్నట్లు మంత్రి సురేఖ తెలిపారు. రానున్న రోజుల్లో వేములవాడ, భద్రాచలం, బాసర, కొమరవెల్లి, కొండగట్టు ఆలయాలను కూడా ఈ చట్టం పరిధిలోకి తీసుకొస్తామని చెప్పారు. అన్ని దేవాయాల పాలకమండలి పదవీ కాలం ఏడాది నుంచి రెండేడ్లకు పెంచుతున్నామని వెల్లడించారు.

బీసీలకు కాంగ్రెస్ ఎప్పుడూ వ్యతిరేకమే

- ఎప్పుడో రిజర్వేషన్లు ఇచ్చి ఉంటే అమెరికాను మించిపోయేవారం
- డెడికేటెడ్ కమిషన్ నివేదికను బహిర్గతం చేయాలి
- 42% రిజర్వేషన్లు ఏ ప్రాతిపదికన నిర్ణయించారు?
- మండలిలో బీసీ రిజర్వేషన్ల బిల్లుపై చర్చలో ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): కేంద్రం, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ బీసీలను ఖాతరు చేయలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనమండలిలో మంగళవారం ప్రవేశపెట్టిన రెండు బిల్లులపై జరిగిన చర్చలో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో బీసీల వెనుకబాటుకు కాంగ్రెస్సే కారణమని అన్నారు. ఇప్పటికైనా రిజర్వేషన్ల పేరిట బీసీలను మభ్యపెట్టవద్దని, పెంచిన రిజర్వేషన్లను అమలుచేసి తీరాలని డిమాండ్ చేశారు. రాజకీయ రిజర్వేషన్లకు కేంద్రం ఆమోదం అవసరమంటూ మాయమాటలు చెప్పవద్దని అన్నారు. ఒకప్పుడు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించారని, ఇప్పుడు రాహుల్‌గాంధీ 'మీరెంతో మీకంత వాటా' అంటూ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ ఏ ప్రాతిపదికన నిర్ణయించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. డెడికేటెడ్ కమిషన్ నివేదికను ఎందుకు బహిర్గతం చేయడం లేదని నిలదీశారు. బీసీ లెక్కలు తప్పుగా చెప్పడం వల్ల భవిష్యత్తు తరాలకు రిజర్వేషన్లలో, ప్రమోషన్లలో అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లుల్లో బీసీలకు గ్రూపుల వారీగా రిజర్వేషన్లను ఎందుకు విభజించలేదని ప్రశ్నించారు. న్యాయపరమైన చిక్కుల్లో ఈ చట్టాలు ఇరుక్కోవద్దన్నది తమ అభిమతమని తెలిపారు. రాష్ట్రంలో బీసీలకు ఏటా రూ.20 వేల కోట్ల మేర బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి గత ఏడాది కేవలం రూ.9200 కోట్లను మాత్రమే కేటాయించారని దుయ్యబట్టారు. కనీసం వచ్చే బడ్జెట్‌లోనైనా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అన్నారు.

విశ్వ బ్రాహ్మణులకు కార్పొరేషన్ ఉండాలి

నీరా కేఫ్‌ను కొనసాగించాలని, జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరు పెట్టాలని, వడ్డెర కులాన్ని ఎస్టీల్లో చేర్చాలన్న డిమాండ్‌పై ప్రభుత్వం ఆలోచన చేయాలని, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో సగర కులానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్లను కొనసాగించాలని కవిత డిమాండ్ చేశారు. విశ్వ బ్రాహ్మణులకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. ఆరె కటిక సామాజికవర్గానికి వధశాలలకు మున్సిపల్ అనుమతులను వేగవంతం చేయాలని, పవర్ లూమ్, హ్యాండ్‌లూమ్ పరికరాలకు 90 శాతం సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. యాదవులు రెండో విడత గొర్రెల పంపిణీ కోసం ఎదురు చూస్తున్నారని, ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కుర్మ సామాజిక వర్గం డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలో చేర్చుతామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని అమలు చేయాలని గంగపుత్రుల కోసం గతంలో చెరువుల్లో 90 కోట్ల ఉచిత చేప పిల్లలు వేస్తే, ఈ ఏడాది కేవలం 19 కోట్ల చేప పిల్లలను కూడా వేయలేదని, కుమ్మరి, నాయీబ్రాహ్మణ వంటి సామాజికవర్గాల డిమాండ్లను, సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సూచించారు.

అప్పుడు ఇచ్చి ఉంటే.. అమెరికాను మించిపోయేవారం

ఎస్సీ, ఎస్టీలతోపాటు బీసీలకు కూడా అప్పుడే రిజర్వేషన్లు కల్పించి ఉంటే అభివృద్ధిలో దేశం అమెరికాను దాటిపోయేదని ఎమ్మెల్సీ కవిత అభిప్రాయపడ్డారు. మనం తల మనమే 50 శాతం జనాభాను ఇన్ని సంవత్సరాల పాటు అవకాశాలకు దూరం పెట్టడం బాధాకరమని అన్నారు. ఉద్యోగ అవకాశాల్లో జాతీయ స్థాయిలో 27 శాతం రిజర్వేషన్లు ఉన్నా.. ఇప్పటికీ కూడా 23 శాతానికిపైగా ఖాళీలు భర్తీ కాలేదని చెప్పారు. దేశంలో 50%ఉన్న బీసీల వద్ద కేవలం 15% మాత్రమే సంపద ఉందని, ఈ అసమానతలను సరి చేయాల్సిన అవసరం ఎందని అన్నారు. ఇప్పటికీ అనేక బీసీ కులాల వారు దుర్భరమైన పరిస్థితులు అనుభవిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

బీసీ బిల్లుకు అవరోధాలు రానివ్వొద్దు

మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

హైదరాబాద్, మార్చి 18 (నమస్తేతెలంగాణ): బీసీలకు 42% రిజర్వేషన్ల బిల్లుకు చట్టపర అవరోధాలు రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ కోరారు. మంగళవారం మండలిలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్ల నుంచి వేచిచూస్తున్న బీసీ రిజర్వేషన్లకు ఇప్పుడు చట్టరూపం వచ్చిందని, కేంద్రం ఆమోదించేలా పకడ్బందీ వ్యూహాన్ని అనుసరించాలని సూచించారు.

సుధీర్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు

మన్సురాబాద్, మార్చి 18: ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీతో తాను హనీమూన్‌లో ఉన్నట్టు సుధీర్‌రెడ్డి వ్యాఖ్యానించారని, హస్తినపురం కార్పొరేటర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేశారు.

బీసీ రిజర్వేషన్ల చట్టం త్వరగా అమలుచేయండి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బీసీ సంఘం వినతి

హైదరాబాద్, మార్చి18 (నమస్తే తెలంగాణ): విద్యా, ఉపాధి, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ చేసిన చట్టాన్ని త్వరితగతిన అమలు చేసేందుకు కృషిచేయాలని తెలంగాణ బీసీ సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గువ్వల భరత్‌కుమార్‌తోపాటు పలువురు నేతలు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేయడం హర్షించదగిన విషయమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరించిన అన్ని పార్టీల ప్రతినిధులు, నేతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. చట్టాన్ని త్వరితగతిన అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవచూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు రాజ్‌కుమార్, వినయ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

తమిళనాడు విధానం పాటిస్తే బాగుండేది

- బీసీ రిజర్వేషన్ల పెంపు చర్చలో బీఆర్ఎస్ పక్షనేత మధుసూదనాచారి సూచన
- పెద్దల సభ పట్ల సీఎం రేవంత్ వైఖరి సరైందికాదని వ్యాఖ్య

హైదరాబాద్, మార్చి 18 (నమస్తేతెలంగాణ): శాసనమండలి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరంగా ఉన్నదని మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి తెలిపారు. బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక, పట్టణ సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల పెంపుపై శాసనమండలిలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచే ప్రక్రియలో తమిళనాడు విధానం పాటించి ఉంటే శాస్త్రీయంగా ఉండేదని సూచించారు. అంబశంకర్ నేతృత్వంలోని ఇండిపెండెంట్ డెడికేటెడ్ కమిషన్‌తో సమగ్రంగా డోర్ టు డోర్ సర్వేను తమిళనాడు ప్రభుత్వం చేయించిందని చెప్పారు. ఆ డేటాను న్యాయస్థానాలు తప్పు పట్టలేకపోయాయని తెలిపారు. అదే పద్ధతిని ఇక్కడ పాటిస్తే బాగుండేదని పేర్కొన్నారు. కానీ అలా చేయకుండా ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ద్వారా సర్వే చేయించడం వల్ల గణాంకాల్లో ప్రభుత్వ పెద్దల ప్రమేయంపై అనుమానాలకు ఆస్కారం ఏర్పడిందని మధుసూదనాచారి వెల్లడించారు. స్థానిక సంస్థలు, విద్యా ఉద్యోగాల రిజర్వేషన్ల పెంపుపై కమిషన్ల నియామకంలో కూడా పొరపాట్లు కనిపిస్తున్నాయని తెలిపారు. వారం రోజుల్లోనే విద్య, ఉద్యోగ రిజర్వేషన్ల పెంపుపై సమగ్ర అధ్యయనం చేసి కమిషన్ నివేదిక సమర్పించడం సాధ్యమా? దాన్ని ఆధారంగా రూపొందించిన చట్టానికి న్యాయపర చిక్కులు ఏర్పడవా? అని ప్రశ్నించారు. ఇలాంటి అనేక లోపాలను ప్రభుత్వం సరిచేస్తే బీసీలకు న్యాయం జరుగుతుందని వెల్లడించారు. బీసీ బిల్లుకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నదని మధుసూదనాచారి వెల్లడించారు. గతంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ ఎక్కడా అమలు చేయలేదని మధుసూదనాచారి విమర్శించారు. ప్రభుత్వ చిత్తశుద్ధి విషయంలో తమకు అనేక అనుమానాలు ఉన్నాయని తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై అన్ని పార్టీలు ఏకం కావాలని పిలుపునిచ్చారు.



తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

చట్టం చేసి చేతులు దులుపుకోవద్దు

- 42% కోటాతోనే స్థానిక ఎన్నికలు పెట్టాలి
- అన్నిరంగాల్లోనూ రిజర్వేషన్లు వర్తింపజేయాలి
- మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్

హైదరాబాద్, మార్చి 18 (నమస్తేతెలంగాణ): 'అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లపై చట్టం చేశాం.. మా పని అయిపోయిందని చేతులు దులుపుకోవద్దు.. పార్లమెంట్‌లో బిల్లు కోసం కేంద్రం వెంటపడి 42% కోటా సాధించాలి.' అని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నాయకులు కిశోర్‌గౌడ్, కురువ విజయ్‌కుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. తమిళనాడు మాదిరిగా బలహీనవర్గాలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లోనే కాకుండా అన్నిరంగాల్లో 42% రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీల అభ్యున్నతి గురించి పదే పదే మాట్లాడుతున్న బీజేపీ, కాంగ్రెస్ తమ చిత్తశుద్ధిని నిరూపించుకొనే అవకాశం వచ్చిందని చెప్పారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ఆమోదం పొందేలా రాహుల్ గాంధీ చొరవ తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో కాంగ్రెస్‌కు సహకరించేందుకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉన్నదని ప్రకటించారు. 42% బీసీ కోటా సాధించిన తర్వాతే స్థానిక సంస్థలకు వెళ్లాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బడ్జెట్‌లో బీసీలకు సబ్‌ప్లాన్ తెచ్చి రూ. 20 వేల కోట్లు కేటాయించాలని పేర్కొన్నారు. కేంద్రం ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని సూచించారు.